క్లుప్తంగా

## మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన ‘దిండిగల’



కేసీఆర్‌తో దిండిగల రాజేందర్

ఇల్లెందు: బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను ఆ పార్టీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల రాజేందర్ బుధవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణం, వచ్చే నెల చేపట్టనున్న సభ్యత్వ నమోదు, పార్టీ సిల్వర్ జూబ్లీ సందర్భంగా వరంగల్‌లో నిర్వహిస్తున్న బహిరంగసభను విజయవంతం చేయాలని, గత ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు, 420 హామీలపై ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ నేతలను నిలదీయాలని కేసీఆర్ ఆదేశించినట్లు దిండిగల వివరించారు.

## విద్యార్థినులకు కరాటే క్లాసులు



కరాటే నేర్చుకుంటున్న విద్యార్థినులు

జూలూరుపాడు: పాపకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు బుధవారం కరాటే క్లాసులు నిర్వహించారు. కరాటే మాస్టర్ బానోత్ నవీన్ రాథోడ్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్కే మీరా సాహెబ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఎండతీవ్రతపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఇల్లెందురూరల్: ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కూలీలు ఇబ్బంది పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరఖాస్తు చేసుకున్న ప్రతీ కూలీకి పని కల్పించేందుకు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. పని ప్రదేశంలో కూలీలు విశ్రాంతి తీసుకునేలా టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించాలని చెప్పారు. ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## 16 నుంచి కరాటే పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి తైక్వాండో, కుంగ్‌ఫూ, కరాటే పోటీల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా బుధవారం ఆవిష్కరించారు. ఈనెల 16న కొత్తగూడెంలోని ఉర్దూఘర్‌లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తైక్వాండో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ మొగిలి తెలిపారు. ఈ పోటీలలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 800 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్, రామకోటి తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పాల్వంచరూరల్: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ సురేష్ తెలిపిన వివరాలు... రేగళ్ల ప్రాంతం నుంచి రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుండగా బుధవారం రాజాపురం గ్రామం వద్ద పట్టుకున్నారు. ట్రాక్టర్ల డ్రైవర్లు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## గిరిధారి కల్యాణం..

# గిరిపుత్రుల సంబురం

ప్రజలంతా రంగులు చల్లుకుంటూ హోలీ సంబురాల్లో మునిగితేలుతున్న వేళ అక్కడ ఆదివాసీలు మాత్రం భక్తిపారవశ్యంతో ఉంటారు. ఉపవాస దీక్షలతో తమ ఇష్టదైవం కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుకుంటారు. ఆ తరువాతే హోలీ వేడుకలు జరుపుకోవడం వారికి అనాదిగా వస్తున్న ఆచారం. రాష్ట్రంలో హోలీ పండుగ రోజు రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించడం మండలంలోని నాయకులగూడెం, కొమరారం గ్రామాల ప్రత్యేకత.

- వేదికగా నాయకులగూడెం, కొమరారం గ్రామాలు
- వేడుకకు ముస్తాబైన శ్రీకృష్ణుని ఆలయాలు
- నేటి నుంచి ఉత్సవాలు షురూ.. రేపు కల్యాణం



ముస్తాబైన కొమరారం రాధాకృష్ణుల ఆలయం (ఇన్‌సెట్) నాయకులగూడెం ఆలయంలో శ్రీకృష్ణుడు

ఇల్లెందురూరల్: భక్తులు రాధాకృష్ణుల ప్రేమను గుర్తు చేసుకుంటూ రంగ పంచమిగా హోలీ వేడుకను జరుపుకుంటారు. ఈ పండుగ వెనుక ఒక ప్రసిద్ధ సంకేత పురుణం కూడా దాగి ఉంది. యవ్వనంలో శ్రీకృష్ణుడు తన ముదురు రంగు చర్మం కారణంగా తెలుపు వర్ణం కలిగిన రాధ తనను ఇష్టపడుతుందో.. లేదో.. అని నిరాశ చెందాడు. శ్రీకృష్ణుడు ఆవహించిన నిరాశతో విసిగిపోయిన అతని తల్లి యశోధ, రాధను సంప్రదించి కృష్ణుని ముఖానికి కావలసిన రంగు వేయమని కోరుతుంది. దీంతో రాధ తనకు నచ్చిన రంగులను కృష్ణుడిపై చల్లుతుంది. ఆ వేడుక వారిలో ప్రేమ చిగురించేందుకు వేదికైందని.. ఇలా రాధ కృష్ణుడు జంటగా మారారని పురాణ గాథల్లో ఉంది. నాటినుంచి ఏటా హోలీ పండుగ రోజున రాధాకృష్ణులకు నూతన రంగుల ద్దడం, అదే రోజున వారి కల్యాణ నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది.

**ఆదివాసీల పర్యవేక్షణలో..**

ఇల్లెందు మండలం నాయకులగూడెం గ్రామంలో ఐదు దశాబ్దాల క్రితం ఆదివాసీ అయిన చాపల ముత్తయ్య శ్రీకృష్ణుని ఆలయాన్ని నిర్మించారు. స్వామి కలలో కనిపించి ఇచ్చిన ఆదేశం మేరకు తన సొంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించారు. నాటి నుంచి నిర్విరామంగా ఆదివాసీలు పూజలు చేస్తూ వచ్చారు. అంతేకాకుండా ప్రతీఏటా హోలీ పండుగ రోజున రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దశాబ్దకాలంగా ఆదివాసీలతోపాటు ఇతర కులాలకు చెందిన వారు కూడా వేడుకలకు హాజరవుతున్నారు. ఈ క్రమంలో నాలుగు దశాబ్దాల క్రితం కొమరారం గ్రామంలో కోరం కోటమ్మకు శ్రీకృష్ణుడిపై భక్తితో తన సొంత ఖర్చులతో రాధాకృష్ణుల ఆలయాన్ని నిర్మించి పూజ చేస్తున్నారు. ఇక్కడ కూడా హోలీ పండుగ రోజున రాధాకృష్ణుల కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

**ముస్తాబైన ఆలయాలు..**

రాధాకృష్ణుల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు నాయకులగూడెం, కొమరారం గ్రామాలలో ఆలయాలను నూతన హంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఏటా అంగరంగ వైభవంగా జరిగే రాధాకృష్ణుల కల్యాణాన్ని తిలకించేందుకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కొమరారం, నాయకులగూడెం ఆలయ కమిటీల ప్రతినిధులు చాపల కృష్ణ, కోరం కోటమ్మ తెలిపారు.

**ఘనంగా కల్యాణం నిర్వహిస్తాం..**

హోలీ పండుగ రోజున రాధాకృష్ణుల కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నాం. వేడుకకు హాజరైన భక్తుల నడుమ ఏటా కల్యాణం ఘనంగా జరుగుతుంది. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం.



– కోరం కోటమ్మ, పూజారి, కొమరారం

**నేటి నుంచి ఉత్సవాలు షురూ..**

కొమరారం, నాయకుగూడెం గ్రామాలలో గురువారం సాయంత్రం తలంబ్రాల బియ్యం సేకరణ, గ్రామదేవతలకు బోనాలు సమర్పించడంతో జాతర ప్రారంభమవుతుంది. శుక్రవారం ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు మంగళతోరణం అలంకరణ, 8 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, 9 గంటలకు గణపతిపూజ, స్వామివారికి ఉపనయనం, అమ్మవారికి గౌరీపూజ, 11 గంటలకు స్వామివారికి ఎదుర్కోలు, మధ్యాహ్నం 1:15 గంటలకు స్వామి వారి కల్యాణం, అనంతరం మహానైవేద్యం, సాయంత్రం గ్రామోత్సవం నిర్వహిస్తారు.

## నీటి కుంటలు ఏర్పాటు చేసుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేకులపల్లి: ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లోని రైతువేదికలో బుధవారం వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఆధ్వర్యంలో వర్షాధారిత ప్రాంతాలలో నేల, నీటి సంరక్షణ పద్ధతులు, నీటి కుంటల నిర్మాణం, వరి సాగులో నీటిని ఆదా చేసే పద్ధతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వాలంతరి పరిశోధనా సంస్థ ప్రతినిధి సుబ్బారావు మాట్లాడుతూ... అధిక వర్షపాతం కురిసినప్పుడు వర్షపు నీటిని నీటి కుంటల ద్వారా సంరక్షించుకోవాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ నీటి కొరత ఉన్న ప్రదేశాలలోనే కాకుండా ఎక్కువ నీరు ఉన్నా కూడా నీటిని తగ్గించి డ్రిప్ ద్వారా పంటలు పండించుకోవాలని సూచించారు. వాగుల ద్వారా ప్రవహించే నీటిని చెక్‌డ్యామ్‌ల ద్వారా నిల్వ చేసుకోవాలని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ మాట్లాడుతూ.. భిన్నరకాల పంటలు పండించే ఆనవాయితీ ఉందని, రైతులు పంట మార్పిడి చేసుకోవాలని సూచించారు. ఇల్లెందు ఏడీఏ జి.లాల్‌చంద్ మాట్లాడుతూ... ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతీ రైతు బోరు పక్కన 20 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పుతో నీటి కుంటను తీయడం ద్వారా నీటిని రీచార్జ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.

## సింగరేణిలో నోటిఫికేషన్ విడుదల

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో తొలిసారిగా కంపెనీకి ఆస్పత్రికి చీఫ్ మెడికల్ ఆఫీసర్–1, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్–1 (కాంట్రాక్ట్ బేస్డ్) నియామకానికి యాజమాన్యం ఈనెల 10న నోటిఫికేషన్ జారీ చేసింది. గతంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా నియమితులైన అధికారి 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రభుత్వం మారటంతో ఆయనను విధుల్లో నుంచి తొలగించారు. ఆసక్తిగలవారు 24వ తేదీలోపు వెబ్‌సైట్ **www.rccminer.com.career** వెబ్‌సైట్‌లో దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. సింగరేణి యాజమాన్యం గతంలో ఎన్నడూలేని విధంగా ఈ కొత్త విధానం పట్ల కార్మికులు, అధికారులు, అధికారుల సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీకి వితరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీకి విద్యార్థుల సౌకార్యార్థం విలువైన పుస్తకాలను మాజీ ఏజీఎం కే.బాలభాస్కర్ బుధవారం బహూకరించారు. మాట్లాడుతూ.. తాను సింగరేణిలో ఏజీఎంగా ఉద్యోగ విరమణ పొందానని, తాను సింగరేణిలో ఉద్యోగం సంపాదించటానికి, ఎంతో విలువైన అంతర్జాతీయ పబ్లికేషన్స్‌కి చెందిన ప్రమాణిక పుస్తకాలను, మెకానికల్ ఇంజనీరింగ్, మెంటల్ ఎబిలిటీ లాజికల్ రీజనింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, కామర్స్‌కి సంబంధించిన పుస్తకాలను సింగరేణి గ్రంథాలయానికి బహూకరించినట్లు చెప్పారు. తనకు గతంలో ఉపయోగపడి, వాటి ద్వారా పొందిన విజ్ఞానాన్ని ఇంతకాలం సంస్థకు అందించి సేవలందించానని, ఈ పుస్తాకాలను నేటి విద్యార్థులు చదువుకుని భవిష్యత్‌లో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

## ఉద్యోగుల ఇంక్రిమెంట్‌పై ఆడిట్



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా వైసీఓఏ క్లబ్‌లో మార్చి నెల అర్హతను అనుసరించి ఎస్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులకు యాన్యువల్ ఇంక్రిమెంట్ బేసిక్ అప్లికేషన్ కోసం కార్పొరేట్ కార్యాలయ సిబ్బంది బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఆడిట్ ప్రతినిధి వినేష్ మాట్లాడుతూ.. గతంలో యాన్యువల్ ఇంక్రిమెంట్ ఆడిటింగ్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించేవారని, ఈసారి ఏరియాలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇంక్రిమెంట్ మార్పి వేతనంలో వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. 394 మంది ఉద్యోగుల ఆడిట్ పూర్తి చేశామన్నారు.

## పెండింగ్‌లో ఆలయ పాలకవర్గం కమిటీ

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి పాలకవర్గం కమిటీని పెండింగ్‌లో పెట్టారు. కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయ పాలకవర్గం కమిటీ 14 మంది సభ్యుల జాబితా ఈనెల 6వ తేదీన వచ్చింది. కానీ ఈ జాబితాను ఈఓ రజనీకుమారి పెండింగ్‌లో పెట్టారు. జాబితాను పెండింగ్‌లో పెట్టాలని కమిషనర్ ఆఫీస్‌ను ఆదేశాలు వచ్చాయని ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి బుధవారం విలేకరులకు తెలిపారు. అయితే కమిటీ సర్క్యులర్‌ను నిలిపివేయాలని పార్టీ కోసం పనిచేసేవారిని గుర్తించి కమిటీలో అవకాశం కల్పించాలని, అధికార పార్టీ నాయకులు పలువురు ఇటీవల మంత్రులను కలిసి విన్నవించుకున్నట్లు సమాచారం.

## రేపు ఇసుక వేలం

పాల్వంచరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ఇసుకను బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వివేక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని వివిధ ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ, రవాణా చేస్తుండగా సీజ్ చేసిన తొమ్మిది ట్రక్కుల ఇసుకను 15వ తేదీ శుక్రవారం ఉదయం వేలంపాట నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగినవారు హాజరై వేలంలో పాల్గొనవచ్చని కోరారు.

## గ్రూప్‌–2 లో రాణించిన గిరిజన యువకుడు



రమేష్

టేకులపల్లి: టేకులపల్లి మండలం కొత్తతండా(పి) గ్రామానికి చెందిన భూక్యా సుక్యా, భద్రి దంపతుల కుమారుడు భూక్యా రమేష్ తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్2 ఫలితాల్లో రాణించాడు. 370 మార్కులతో స్టేట్ ర్యాంక్ 475, ఎస్టీ ర్యాంక్ 20 సాధించి సత్తా చాటాడు. ప్రస్తుతం అటవీ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమేష్ 2008–09లో ఇన్ఫోసిస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, 2012–2022 వరకు వీఆర్‌ఓగా పని చేశాడు.

## పూరిల్లు దగ్ధం



కాలిపోతున్న పూరిల్లు

జూలూరుపాడు: భేతాళపాడు గ్రామ పంచాయతీ పంతులుతండాకు చెందిన బానోత్ రాందాస్ అనే వ్యక్తి పూరిల్లు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో బుధవారం రాత్రి దగ్ధమైంది. బాధిత కుటుంబం, స్థానికులు తెలిపిన వివరాలు.. రాందాస్, తండ్రి బాబులాల్, కొడుకు ఈశ్వర్‌లు పొలం పనులకు వెళ్లారు. ఈ సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. సుమారు రూ.ఒక లక్ష నగదు, రెండు తులాల బంగారం, బియ్యం, 20 బస్తాల ధాన్యం, స్టడీ సర్టిఫికెట్లతోపాటు, భూమి పత్రాలు కాలిపోయినట్లు బాధిత కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

## వీధి కుక్కల దాడి

పాల్వంచ: వీధి కుక్కల దాడిలో రిటైర్డ్ ఉద్యోగికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి పోసారపు భిక్షమయ్యపై ముత్యాలమ్మ గుడి వద్ద వీధి కుక్కలు దాడి చేశారు. స్థానికులు ఆయన్ను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## కంపెనీ ఉద్యోగులనే నియమించండి..



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): చీఫ్ మెడికల్ ఆఫీసర్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పోస్టులలో కంపెనీ ఉద్యోగులనే నియమించాలని, కొత్తగూడెం, కార్పొరేట్ ఏరియాల అధికారుల సంఘం నాయకులు ఏరియాల హెచ్‌ఓడీలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సుమారు 30 సంవత్సరాలు అనుభవం ఉన్న, సర్వీస్‌లో ఉన్నవారిని కాకుండా కొత్త పద్ధతిలో బయట వ్యక్తులను తాత్కాలికంగా నియమించటానికి ప్రయత్నించటం అంకితభావంతో పనిచేసే అధికారులను నిరుత్సాహపరిచే విధంగా, అభద్రతకు గురిచేసే విధంగా ఉందన్నారు. ఇప్పటికే సంస్థలో స్పెషలిస్ట్ డాక్టర్లు కంపెనీలో కొనసాగటానికి నిరుత్సాహంగా ఉన్న తరుణంలో పదోన్నతి అవకాశాలు కూడా నిరాకరిస్తే ఈ స్పెషలిస్ట్ డాక్టర్ల కొరత సమస్య ఇబ్బందిగా మారుతుందన్నారు. ఉత్తర్వులను యాజమాన్యం వెనక్కి తీసుకోవాలని లేదంటే ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. సంస్థను నమ్ముకొని చాలాకాలం నుంచి పనిచేస్తున్న ఉద్యోగులను విస్మరించి కాంట్రాక్ట్ ఉద్యోగులతో అధికారులపై పెత్తనం చెలాయించటం సరైన విధానం కాదని, కంపెనీ ఈ విషయంలో మరోమారు ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సానుకూలంగా స్పందించిన అధికారులు వీలైనంత త్వరలో ఈ సమస్యకు పరిష్కార మార్గం చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## స్థానికులకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న దేవదానం

పాల్వంచరూరల్: ఏజెన్సీ ప్రాంతంలోని పరిశ్రమల్లో స్థానికులకు 80 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర కార్యదర్శి మల్లేల రామనాథం, జిల్లా నాయకులు దేవదానం డిమాండ్ చేశారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని కొమురంభీమ్ భవనంలో బుధవారం బరగడి దేవదానం అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని సీతారాం ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీరు అందించాలన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి 250 గజాల ఇంటి స్థలం, పింఛన్లు ఇచ్చి గుర్తింపుకార్డులు ఇవ్వాలని, బీటీపీఎస్‌లో భూనిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలని, సారపాక నుంచి ఏటూరునాగారం వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మాణం చేయాలని, కేటీపీఎస్ కాంట్రాక్టు కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నబీసాహెబ్, పగడాల కరుణాకర్‌రెడ్డి, సురకంటి ప్రభాకర్‌రెడ్డి, బుడగం నాగేశ్వరరావు, హుస్సేన్, అన్నం శ్రీనివాస్, బత్తుల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## పుట్టినింటి మనుగడకు ఐక్య పోరాటాలు



మాట్లాడుతున్న రాజ్‌కుమార్

ఇల్లెందు: బొగ్గుకు పుట్టినిల్లైన ఇల్లెందు ఏరియా మనుగడకు ఐక్య పోరాటాలు అవసరమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏరియాలోని జేకే ఓసీ వద్ద బుధవారం నిర్వహించిన పిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జేకే ఓసీ విస్తరణ ప్రారంభమయ్యే వరకు ప్రస్తుత ఓసీ నడిచేలా యాజమాన్యం కృషి చేయాలని కోరారు. ఈనెల 7, 8 తేదీలలో సీఎండీ స్థాయిలో జరిగిన సమావేశంలో ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా సొంత ఇంటి పథకం, వడ్డీలేని రుణం, కార్పొరేట్ స్థాయి వైద్య సదుపాయం, ఫ్లేడేలలో ఎస్–1 ఎత్తివేయాలని, ప్రస్తుతం ఉన్న జనరల్ మజ్దూర్ బదిలీ వర్కర్ హోదా పేర్లను మార్చి జనరల్ అసిస్టెంట్‌గా చేయాలని, ఇన్‌కంటాక్స్, సొంత ఇంటి పథకంపై యాజమాన్యంతో పూర్తిస్థాయిలో మాట్లాడటం జరిగిందని వివరించారు. సమావేశంలో డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సారయ్య, ఏరియా ఉపాధ్యక్షుడు రాజారాం, నాయకులు శంకర్, బందం నాగయ్య, బొల్లెద్దు శ్రీనివాస్, జయరాజు, తిరుమలరావు, కిషోర్, రమేష్ పాల్గొన్నారు.

## ఆడ, మగపిల్లలను సమానంగా చూడాలి



సీతాలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): మహిళల సమానత్వం ఇంటి నుంచే ప్రారంభం కావాలని, నిరంతరం మహిళలను గౌరవించాలని, ఇంట్లో మగ, ఆడపిల్లలను సమానంగా చూడాలని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. బుధవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని గౌతంపూర్ కమ్యూనిటీ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలు ప్రగతి గ్రామ సమాఖ్య వీఓ పద్మ, ఎస్‌ఆర్‌కేటీ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చైర్ పర్సన్ విశిష్ట అతిథులుగా శిశు సంక్షేమాధికారి స్వర్ణలత లెనినా, డాక్టర్ సాగరిక హాజరయ్యారు. ఈ సందర్భంగా కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ... సమాజంలో పురుషులతో పాటు మహిళలకు సమాన హక్కులు కలిగి ఉండాలని విద్య, ఉపాధి రాజకీయ రంగాలలో మహిళల భాగస్వామ్యం పెరగాలని, ప్రభుత్వ ప్రైవేట్ రంగాలలో మహిళలు కీలక స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. స్వర్ణలత లెనినా మాట్లాడుతూ.. చదువే మహిళ సాధికారతకు ప్రధాన ఆధారమని, అమ్మాయిలు చదువు ఆ కుటుంబాలనికి వెలుగునిస్తుందని, తల్లితండ్రులు తమ కుమార్తెకు పూర్తి స్వేచ్ఛనిస్తూ మంచి విద్యనందించాలన్నారు. కార్యక్రమ నిర్వాహకులు వీఓఏ పద్మ, రత్నకుమార్, ముఖ్యఅతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కోఆర్డినేటర్ రూప, ఉమ, సుమ, లావణ్య, మల్లీశ్వరి, సాహితి, ప్రియాంక, సీసీలు భాగ్యమ్మ, సత్యవతి పంచాయతీ సెక్రటరీ షర్మిల, అజ్మీర ఇందిర, దండబోయిన లలిత, కుమారి, నర్మద, బానోత్ భూమిక తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నంబర్ల వివాదంపై క్షేత్రస్థాయి సర్వే



రైతులతో మాట్లాడుతున్న డీఐ శ్రీనివాస్

ఇల్లెందురూరల్: హైకోర్టు ఆదేశాల మేరకు రైతుల నుంచి రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న భూమికి సంబంధించిన సర్వే నంబర్ నిర్ధారణకు సర్వే విభాగం అధికారులు బుధవారం సర్వే ప్రారంభించారు. మండలంలోని సీఎస్పీ బస్తీ గ్రామపంచాయతీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ గురుకుల భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. సదరు భూమికి పట్టాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకుంటున్నట్లు ప్రకటిస్తూ భూమిలో ఫ్లెక్సీ పెట్టారు. తాము ఇంతకాలం సాగు చేసుకున్న భూమికి గతంలో రెవెన్యూ అధికారులు పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చారని, అందులో సర్వే నంబర్ 618గా నమోదు చేశారని పేర్కొంటూ బాధిత రైతులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేసిన హైకోర్టు సమగ్రంగా సర్వే చేసి స్పష్టమైన సర్వే నంబర్లను వెల్లడించాలని సర్వే విభాగాన్ని కోర్టు ఆదేశించింది. ఇందులో భాగంగా బుధవారం క్షేత్రస్థాయి సర్వే చేసిన అధికారులు రెండు సర్వే నంబర్లకు సంబంధించిన భూభాగాన్ని పూర్తిగా సర్వే చేసి నమూనా మ్యాప్‌ను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా సర్వే విభాగం డీఐ శ్రీనివాస్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. సర్వే ఆధారంగా సరిహద్దులు నిర్ధారించి నివేదికను కోర్టుకు సమర్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్వేయర్ ప్రియాంక, రెవెన్యూ, సింగరేణి, అటవీశాఖ అధికారులు, సిబ్బంది, సాగులో ఉన్న రైతులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారు..



దీక్ష చేస్తున్న నాయకులు

పాల్వంచ: ఎస్సీ వర్గీకరణ అయిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తామని మాదిగలకు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఎమ్మార్పీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొత్తపల్లి సోమయ్య అన్నారు. గ్రూప్ 1,2,3 పరీక్ష ఫలితాల ప్రకటించడాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. ఈ దీక్షలను జిల్లా మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కాటూరి సంజీవరావు ప్రారంభించారు. సోమయ్య మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ తుది దశకు వచ్చిన క్రమంలో కూడా మాదిగ ఉప కులాలు నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంగపురి శ్రీను వంగూరి రామ్మూర్తి, చీకటి కార్తీక్, వసంత్, గణేష్, కోట వెంకటేశ్వర్లు, నాగరాజు, దాసరి యాకయ్య, దుర్గారావు, వెంకటరత్నం పాల్గొన్నారు.